


# అమెరి'కలకలం' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు



*14*

# “నట సమ్రాట్” తో - అప్పుడప్పుడూ - యాభై మూడేళ్ళగా

అవును. ఆ విషయం నా ఒక్కడికీ తప్ప ఆయనకి ఏ మాత్రం గుర్తు ఉండే అవకాశం లేదు. నాకైతే ఆ అరగంటా జీవితాంతమూ మర్చి పోయే ప్రసక్తే లేదు. అది 1961 వ సంవత్సరం. అంటే యాభై మూడేళ్ళ ఏళ్ల కిందటి మాట. సినిమాలలో ఔట్ డోర్ షూటింగ్ దృశ్యాలు ఒక వేళ ఉన్నా అన్నీ మద్రాసులోనే తీయబడే ఆ రోజుల్లో, బహుశా మొట్ట మొదటి సారిగా ఒక తెలుగు సినిమా విశాఖపట్నం రామకృష్ణా బీచ్ లో షూటింగ్ జరుపుకోవడం ఒక సంచలనాన్ని సృష్టించింది. ఆ సినిమా పేరు అందరికీ తెలిన “కులగోత్రాలు.” సినిమా కథా పరంగా హీరో నాగేశ్వర రావు పైలా పచ్చీసుగా తిరిగే ఒక కాలేజీ విద్యార్థి అయితే అప్పుడు నేను ఆంధ్రా యూనివర్సిటీలో నార్త్ కేంపస్ లో మొదటి సంవత్సరం ఇంజనీరింగ్ చదువుతున్న “బుద్ధిమంతుడైన” కుర్రాణ్ణి. అప్పటికే ఆయన “నట సామ్రాట్” బిరుదు పొంది నాలుగేళ్ళు అయిన 38 సంవత్సరాల యువ అగ్రతార అయితే నేను కేవలం నూనుగు మీసాల పదిహేడు సంవత్సరాల వయసులో “నాగ్గాడి” సినిమాలు రొమాంటిక్ గా ఉంటాయి అనుకునే అభిమానిని. సినిమా నిర్మాతలు ఎంత రహస్యంగా ఉంచినా, నాగేశ్వరరావు మధ్యాహ్నం భోజనం విరామం కోసం, యూనివర్సిటీ లేడీస్ వైటింగ్ రూము కి వస్తాడనే వార్త మొత్తం విశ్వవిద్యాలయం కేంపస్ అంతా గుప్పుమనే లోపుగానే ఎక్కడో నార్త్ కేంపస్ లో ఉన్నప్పటికీ చప్పున అందుకున్న వాళ్ళలో నేనొక్కడిని కావడం నా అదృష్టమే! నాకు ఏ మాత్రమూ ఇష్టం లేని, క్లిష్టమైన “ఇంటెగ్రల్ కాలుక్యులస్” క్లాస్ లో ఉండగా ఎవడో నాకు ఒక చిన్న చీటీలో ఈ వార్త అందించాడు. అప్పటి యూనివర్సిటీ కేంపస్ లో మెయిన్ గేట్ నుంచి వైస్ చాన్సెలర్ గారి ఇంటి మీదుగా బహుశా అర మైలు కొండెక్కి కేఫటేరియాకి ఎదురుగుండా, ఓపెన్ ఎయిర్ థియేటర్ పక్కన ఆ లేడీస్ వైటింగ్ హాలు అని చూచాయగా తెలుసు. అంతే. వెంటనే లఘు శంక వంకతో క్లాసు ఎగ్గొట్టి, ఒకరిద్దరు స్నేహితులతో అప్పటి ఎర్ర మట్టి గుట్టలలో ఆ లేడీస్ రూము కేసి పరిగెట్టడం మొదలు పెట్టాను. ఆ రోజుల్లో “ఫేషన్” అయిన హవాయి చెప్పులు ఎర్ర మట్టితో కొట్టుకు పోయి, వేసుకున్న పంట్లాం వెనక వేపు కూడా ఎర్రగా మచ్చలతో ఉన్న నన్ను గుమ్మం దగ్గరే “సైంధవులు” అడ్డుకున్నారు. అప్పటి కింకా ఎక్కువ మంది విద్యార్థులకి తెలియక యువజన సందోహం లేదు తెలియదు కాబట్టి లోపల్నించి చూసి “పరవా లేదు. అతన్ని రానియ్యండి.” అని అక్కినేని గారు

అనబట్టి నన్ను లోపలికి వెళ్ళనిచ్చారు. ఎదురుగుండా కుర్చీలో కూచుని స్వచ్ఛమైన, తెలుగు తేజస్సుతో మహా ఠీవి గా ఉన్న ఆయన నన్ను పలకరించి "ఏం చదువుతున్నారు? క్లాసులు లేవా?" అనేసి నోట మాట పెగలక నేను గుర్, గుర్ అని అవస్త పడుతుంటే నవ్వేసి నాతో వచ్చిన "ఇద్దరు మిత్రుల" నీ అదే ఆప్యాయతో పలకరించారు. పక్కనే ఉన్న అందాల నటి కృష్ణ కుమారి గారితో కూడా నాది అదే పరిస్తితి. అటు "నట సమ్రాట్" ని చూసి తరించాలా, పక్కనే నాగేశ్వర రావు తో సహా... ఎంతో పొడుగ్గా, తెల్లగా పొందికగా ఉన్న అద్భుతమైన అందాల రాశి కృష్ణ కుమారిని చూడగానే పెరిగిపోయిన లబ్ డబ్ అనే గుండె చప్పుడు ఎలా తగ్గించుకోవాలా అనే దుస్తితి నా జీవితంలో ఆ ఒక్క సారే కలిగింది.

ఇప్పుడు అదంతా తల్చుకుంటూ ఉంటే సరదాగాను, సిగ్గు గానూ, ఎంతో గర్వంగానూ ఉంటుంది. లెక్క పెట్టుకో లేదు కానీ ఈ యాభై మూడేళ్ళలోనూ అక్కినేని గారిని ఇండియాలోనూ, అమెరికాలోనూ సభలలోను, వారి ఇంట్లోనూ, స్నేహితుల ఇళ్ళలోనూ చాలా సార్లు కలుసుకుని, అనేక సమయాల్లో వ్యక్తిగతంగా గంటల సేపు గడిపాను. అనేక సందర్భాలలో ఆయనతో ఫోన్ లో మాట్లాడినప్పుడు కూడా ఆయన ఆత్మీయతని ఆస్వాదించాను. ఆయన మాటల్లోనే చెప్పాలంటే ఆయన జీవితం "తెరచిన పుస్తకం". అందు చేత ఆయన నటన గురించి, నిబద్ధత గురించి నేను వేరే వ్రాయనక్కర లేదు. కానీ నా బోటి ఒక సర్వ సాధారణ వ్యక్తిని కూడా అదెక్కడా తెచ్చి పెట్టుకున్నట్టుగా కాకుండా, నాటకీయత లేకుండా ఆయన పలకరించే తీరు ఒక్కటే చాలు ఆయన వ్యక్తిత్వ విశిష్టత ని ఆదర్శప్రాయంగా తీసుకోడానికి.

మరో ముఫై ఏళ్ల తరువాత 1980 ప్రాంతాలలో ఆయనని రెండో సారి మా హ్యూస్టన్ లో కలుసుకున్నాను అదే ఆయన మొట్ట మొదటి సారి మా హ్యూస్టన్ రావడం. అప్పుడు మా పుర ప్రముఖులు తుమ్మల కుటుంబ రావు గారు ఒక క్లబ్ హౌస్ లో చిన్న ఇష్టా గోష్టి ఏర్పాటు చేశారు. గట్టిగా అర డజను మంది కూడా లేని ఆ ఇష్టా గోష్టి ఎంతో వ్యక్తిగత సాన్నిహిత్యంతో జరిగింది. ఆ అప్పుడు నేను సరదాగా ఆయన శైలిని అనుకరిస్తూ "అన్నపూర్ణా, నాకున్న ఒకే ఒక్క టెర్లిన్ చొక్కా మీద ఇంత కొబ్బరి చెట్నీ వేస్తావా...నిన్ని ఆ భగవంతుడు కూడా క్షమించడు. క్షమించడు, అన్నపూర్ణా, క్షమించడు" అని నటించగా ఆయన మనసారా నవ్వేసి, "మనిద్దరం యింకా చాలా ఇంప్రూవ్ చేసుకోవాలి" అని ఒక చురక వేసి నన్ను ఆశీర్వదించారు. చాలా సంవత్సరాల తరువాత బాగా పరిచయం అయ్యాక కూడా ఒకసారి నేను గుర్తుంటానో లేదో అని అనుమానం తో మళ్లీ పరిచయం చేసుకుంటూ ఉంటే ఆయన భుజం తట్టి "వంగూరి గారూ, మీరు నా కన్నా వరల్డ్ ఫేమస్" అని చమత్కరించి ఆత్మీయంగా మాట్లాడారు.

మరొక మరపు రాని సంఘటన 2006 లో జరిగింది. మేము..అనగా వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా... డిశంబర్ 31, 2006- జనవరి 1, 2007 తారీకులలో బాపు-రమణ ల మైత్రీ షష్టిపూర్తి ప్రధాన అంశంగా హైదరాబాద్ లో మొట్టమొదటి ప్రపంచ తెలుగు సాహితీ సదస్సు నిర్వహిస్తున్నట్టు వంశీ రామరాజు గారి ద్వారా తెలుసుకున్న ఎన్నార్ గారు నాకు కబురు పెట్టారు. వెంటనే ఆయనని కలుసుకున్నాను. కాస్సేపు మాట మంతీ అయ్యాక "మీరు తలపెట్టిన కార్యక్రమం కాన్సెప్ట్ బావుంది. అందులోనూ బాపు-రమణలు ఇద్దరూ సతీ సమేతంగా రావడానికి ఒప్పుకున్నారంటే అది పెద్ద విశేషమే. అటువంటి సభలో మాట్లాడే అవకాశం కూడా చాలా అరుదైనదే. మీరు వేరే ఏర్పాట్లు చేసుకుని ఉండక పోతే, నేను వారిద్దరి గురించి నా స్వానుభవాలు క్లుప్తంగా చెప్పగలను" అని ఆ సభలో తను మాట్లాడడానికి ఇష్టపడుతున్నట్టు సూచించారు. అది వినగానే అక్కినేని అంతటి మహానుభావుడు తనంత తాను ఈ

సాహితీ సదస్సుకు వస్తాననడం నాకు ఆ క్షణంలో అపరిమితమైన ఆనందాన్ని కలిగించినా నాకు పచ్చి వెలక్కాయ గొంతుకలో పడిన భావం కలిగింది. దానికి రెండు కారణాలు. ఒకటేమో అప్పటికే మేము సి. నారాయణ రెడ్డి గారిని ప్రధాన వక్తగా ఆహ్వానించేశాం. మరొకటీ. అంతకంటా  ముఖ్యమైనదీ రాజకీయవేత్తలనీ, సాహితీవేత్తలు కాని సినిమా వారిని ఈ సభలకి అతిధులుగా ఆహ్వానించకూడదు అని మేము పెట్టుకున్న నియమం. పైగా అక్కినేని వస్తే ఆయనే  కేంద్ర బిందువు అయిపోయి సాహిత్య ప్రసంగాలు చేసే వక్తలకి వేద్దామనుకున్న పెద్ద పీట చిన్నదైపోతుందేమో అని భయం కూడా నాకు వేసింది.  అందుచేత మామూలుగా  అయితే "తప్పకుండా సర్, అంతకంటేనా" అని తక్షణం స్పందించే బదులు నేను కొంచెం తడబడతూ "ఇవి సాహిత్య సభలు కదా....కేవలం రచయితలూ, సాహితీవేత్తల కోసమే.." అని నసుగుతూ ఉంటే "నేను కూడా నాలుగైదు పుస్తకాలు రాసాను కదా. ...ఓ ఓ ....అవన్నీ నా గురించి నేను రాసుకున్నవేగా..ఎనీవే..నేను రచయితని కాను కానీ రచయితలకి మెటీరియల్ ని" అని మొత్తం నా అనుమానాలని అరక్షణంలో అర్ధంచేసుకుని "గుడ్ లక్" అన్నారు. ఆ తరువాత నేను గత అక్టోబర్ 2013 దాకా నేను ఎన్ని సార్లు ఆయనతో మాట్లాడినా, కలుసుకున్నా ఈ ప్రసక్తి ఏ కోశాన్నా రాలేదు. అక్కినేని గారి ఉన్నత వ్యక్తిత్వానికీ, సంస్కారానికీ ఇంతకంటే ఉదాహరణ ఇంకేం కావాలి?

2009 లో అనుకుంటాను ....అక్కినేని – అన్నపూర్ణ గార్ల 60 వ వివాహ వార్షికోత్సవం  ఒక పెద్ద హోటెల్ లో జరిగింది. ఆ సమయంలో నేను హైదరాబాద్ లో ఉన్నాను. అది తెలిసి ఆయన ఆ ఉత్సవాలకి నాకు ఆహ్వానం పంపిం'చారు. నేనూ, వంశీ రామరాజు గారూ వెళ్లాం.  అక్కినేని నాగార్జున మమ్మల్ని రిసీవ్ చేసుకుని  నాగేశ్వర రావు గారూ, అన్నపూర్ణ గారూ ఉన్న కుర్చీల దగ్గరకి తీసుకెళ్ళా రు. రామరాజు గారు నన్ను పరిచయం చెయ్యబోతూ ఉంటే అక్కినేని గారు ఆయన్ని వారించి "ఉండవయ్యా. వంగూరి గారి గురించి నాకు బాగానే తెలుసు. చాలా మంచి పనులు చేస్తున్నారు". అని "ఈయన నాకన్నా అక్కడా, ఇక్కడా కూడా వరల్డ్ ఫేమస్" అన్నపూర్ణ గారికి  నా పూర్తి పేరుతొ సహా  పరిచయం చేశారు.  అది చూసి నేనూ, రామరాజు గారూ కూడా "దంగై" పోయాం.  ఆ సాయంత్రం ఆ దివ్యమైన పండగకి యావత్ తెలుగు సినీపరిశ్రమ తరలి వచ్చింది.  అక్కడ నేను చూడని హీరోయిన్ లేదు, చూడదల్చుకోని హీరో లేడు.  ఒక పక్క వేదిక మీద పి. సుశీల గారు పాడుతుంటే వెళ్లి  పలకరించగానే "నువ్వు ఇక్కడేం చేస్తున్నావు? " అన్నారు ఆ మహా గాయని. ఇక నాకు ఎంతో ఆత్మీయురాలు, ఈ "హాస్య కౌముది"  లో నాకంటే పై స్థాయిలో పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న బలభద్ర పాత్రుని రమణి మరియు....నమ్మండి నమ్మక పొండి....ఆవిడని భరిస్తున్న భర్త  ప్రభాకర్ గార్లు ఆ సినిమా గేంగ్ లో "కాకుల్లో హంసల్లా" వెలిగిపోయారు.  ఎప్పుడెప్పుడో అమెరికా వచ్చినప్పుడు మా ఇంట్లో ఉన్న చాలా మంది ప్రముఖులు అక్కడ నన్ను చూసి, పలకరించి అలనాటి అమెరికా స్మృతులు నెమరు వేసుకున్నారు. అక్కినేని వారు ఎంతో సహృదయంతో నన్ను ఆహ్వానించక పొతే ఇంతటి అద్భుతమైన అవకాశం నాకు దక్కేదే కాదు.  అక్కడ కలుసుకున్న కళాకారులూ, ప్రతిభావంతులతో పోల్చి చూస్తే, నేను అపుడప్పుడు ఎగరేసుకుంటున్న కాలర్  సిగ్గుతో తలవంచుకుంటోంది.

ఆ తరువాత దురదృష్టవశాత్తూ అన్నపూర్ణ గారు పరమపదించినప్పుడు పరామర్శించడానికి అక్కినేని గారికి ఫోన్ చేశాను. ఏ కారణం చేతనో సుమారు గంట సేపు అక్కినేని గారు తమ 60 ఏళ్ల సాహచర్యంలో అనేక అంశాల గురించి చెప్పుకొచ్చారు. ఉదాహరణకి ఆయన పెళ్లి అయిన కొత్తలో ఇద్దరూ కలిసి ఒక సినిమాకి వెళ్లారట. అది మద్రాసు కాబట్టి అప్పటికే ఆయన పెద్ద హీరో అయినా అక్కడ ఎవరూ  గుర్తుపట్టరని అనుకున్నారుట. కానీ ఇంటర్వెల్ లో లైట్స్ వేసినప్పుడు కొందరు గుర్తు పట్టి గుసగుసలు

మొదలుపెట్టారట. ఒక కుర్రాడు “నాగేశ్వరరావు పక్కన అంజలీ దేవి లా ఉంది” అనీ “అబ్బే, కాదు, సావిత్రి అయి ఉంటుంది” అని మరొకడూ “అబ్బే, సావిత్రికి ఎత్తు పళ్ళు ఉండవు ఈవిడలా....నాగేశ్వర రావు ఎవరో ఎక్స్ ట్రా ని వేసుకొచ్చాడు” అనీ మాట్లాడుకుంటూ ఉంటే అవి ఆయనా, ఆవిడా విని అప్పటి నుంచీ కలిసి పబ్లిక్ సినిమా హాళ్ళలో సినిమాకి ఎప్పుడూ వెళ్ళ లేదట. ఎక్కడో అమెరికాలో ఉండి, సాధారణ పరిచయం మాత్రమే ఉన్న నాతో అక్కినేని గారు అటువంటి ఆత్మీయ సంభాషణ జరిపారు అంటే నాకు ఇప్పటికీ ఆశ్చర్యం గానే ఉంటుంది. నిజానికి ఒకసారి ఆయన ఇంటికి వెళ్ళినప్పుడు మేము విజిటర్స్ రూము లో కూచున్నాం. ఆయన లోపల నుంచి కొంచెం ఆలస్యంగా చేతులు తుడుచుకుంటూ వచ్చి “సారీ...మా ఆవిడకి మసాజ్ చేస్తున్నాను” అని యాదాలాపంగా అనేసి మాటలలో పడ్డారు. అక్కినేని గారి ఆదర్శ దాంపత్యానికి ఇది మరొక చిన్న ఉదాహరణ.

అక్కినేని గారు ఎంత మాటకారో అంత చమత్కారి కూడానూ....ఒకసారి ఆయనతో మాట్లాడుతున్నప్పుడు ఆయన చీటికీ, మాటికీ నడుం మీద గోక్కుంటున్నారు. నేను సరదాగా “అదేమిటే సార్, అంత దురదా?“ అన్నాను. ఆయన వెంటనే నవ్వేసి “అవును మరి. అది మీకెలా తెలుస్తుందీ?. నేను థభై పైగా హీరోయిన్స్ తో రొమాంటిక్ సీన్స్ లో నటించాను. ఏమో ఎవరు ఏం అంటించారో?” అని నా నోరు మూయించారు. మరొక సారి ఆయనని చూడడానికి వెళ్తూ మా ఆఖరి చెల్లెలు ఉషారేవతినీ, నా పెద్ద మేనగోడలు దుర్గ నీ తీసుకెళ్ళాం. “నా సుత్తి మీ ఒక్కరూ భరించదల్చుకోలేక మీ వాళ్ళని కూడా తీసుకొచ్చారా?” అని ఆ తరువాత మళ్ళీ కలిసినప్పుడు చమత్కరించారు ఏఎన్నార్.

మరొక సారి ఏమయిందంటే, నేను చిరకాల మిత్రులు, సహృదయులు అయిన న్యూయార్క్ వాసి రవి కొండబోలు గారికి ఏదో పని మీద ఫోన్ చేస్తే మా మాటలు అయ్యాక “అక్కినేని గారు వచ్చారు. మాట్లాడతారా?” అని అడిగారు. “అయ్యో, తప్పకుండా” అని “ఏమిటి సార్, మీరు అమెరికా వచ్చి చాలా ఏళ్లయింది. ఎప్పుడొచ్చారు ఎలా ఉన్నారు?” అని అక్కినేని గారిని పలకరించాను. దానికి ఆయన “అవును వంగూరి గారూ, ఏదో వయసు ముదురుతోంది కదా, మిత్రులందరినీ ఒక సారి చూసి పోదామని ధైర్యం చేసాను.” అన్నారు. దానికి నేను నవ్వి “వయసు ముదరడం ఏమిటి సార్, అమెరికాలో మగాడి వయసు గురించిన జోకు మీరు వినలేదా” అన్నాను. “ఆడవారి వయసు మీద చాలా జోకులే విన్నాను కానీ. మగాడి వయసు మీద జోకులేమిటీ?” అన్నారు అక్కినేని. “అదే సార్. అమెరికాలో మగవాడి వయసు అతను చూసే ఆడపిల్ల వయసు తో సమానం అంటారు” అన్నాను. ఒక నిముషం తర్వాత ఆయన ఆ జోక్ ని అర్థం చేసుకుని “ఓరినీ, ఆదా...అయితే నేను ఇప్పటి నుంచీ ఇరవై ఏళ్ల ఆడ పిల్లల కేసే చూస్తే సరి పోతుంది అన్నమాట. ఆ మాట కొండబోలు రవితో కూడా చెప్పండి....” అని అక్కినేనిగారు మనఃస్ఫూర్తిగా నవ్వేశారు నా చిన్న చమత్కారానికి. అలాగే “శ్రీ రామరాజ్యం” అమెరికాలో కూడా విడుదల అయిన మొదటి ఆట చూడ గానే ముందు బాపు గారికి. వెనువెంటనే అక్కినేని గారికి ఫోన్ చేసి అభినందనలు తెలిపినప్పుడు మహానందపడి, అప్పటికే ఆ సినిమాలో వాల్మీకి గా ఆయన నటనకి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారన్న మాట విని మహా రిలాక్సింగ్ మూడ్ లో ఉన్నారేమో ఉన్నారేమో ఆ రోజు అనేక విషయాల మీదా, అప్పుడప్పుడు ఆయన చదివిన నా కథల మీద గంట సేపు మాట్లాడారు.

ఇక 2012 లో డాలస్ లో జరిగిన అక్కినేని గారి 89 వ జన్మదినోత్సవం, 2013 లో హైదరాబాద్ లో జరిగిన 90వ జన్మదినోత్సవం లోనూ కూడా పాల్గొనే అపురూపమైన అదృష్టం నాకు కలిగింది. అక్కినేని గారు తానా వారి కోరికపై సెప్టెంబర్ 2012

లో అమెరికా వస్తున్నట్టు వార్త తెలియగానే, ఆ నెలలోనే మా అమ్మాయి పెళ్లి కూడా జరగబోతోంది కాబట్టి నేను అర్జంటుగా ఆయన్ని పిలిచి మా అమ్మాయి పెళ్ళికి ఆహ్వానించాను. “తప్పకుండా వస్తాను. ఇటీజ్ మై ప్లెజర్” అని ఆయన ఎంతో ఉత్సాహంతో స్పందించి తన అమెరికా ప్రయాణం ఏర్పాట్లు చేస్తున్న వారికి  హ్యూస్టన్ మా అమ్మాయి పెళ్ళి నాటికి వచ్చే ఏర్పాట్లు చేయించమని నాకు అనుమతి ఇచ్చారు.  ఎటొచ్చీ ఎంత ప్రయత్నం చేసినా పెళ్లి అయిన నాలుగు రోజుల దాకా ఆయన  ఆయన హ్యూస్టన్ వచ్చే ఏర్పాట్లు



చెయ్యడం కుదర లేదు. అది తెలిసి ఆయన “పోనీ మనం ఎలాగా డాలస్ లో కలుస్తాం కదా. అక్కడికి నూతన వధూవరులని తీసుకు రండి. ఐ విల్ బ్లెస్ దెం” అన్నారు. ఇక నాకు ఆప్త మిత్రులు, అప్పటి తానా అధ్యక్షులు  అయిన ప్రసాద్ తోటకూర గారి వినూత్నమైన ఆలోచనలు, సమర్ధవంతమైన నాయకత్వం లో  తానా వారు డాలస్ లో అద్వితీయంగా జరిపిన అక్కినేని 89వ జన్మదినోత్సవ వేడుకలలో, అక్కినేని గారిని శ్వేత అశ్వ శకటం లో ఊరేగిస్తూ సభా ప్రాంగణంలోకి తీసుకు రావడం, ఆయన చిత్రాల చిత్ర సమాహారాన్ని ఆయన చేతే ఆవిష్కరింప చేయించడం మొదలైన అంశాలలో నేను అక్కినేని గారి పక్కనే ఉండే అవకాశం నాకు తానా వారు కలిగించారు. ఆ నాటి ఫోటోలు కొన్ని ఇందుతో జతపరుస్తున్నాను. అంతే కాదు అమెరికా తెలుగు ప్రముఖులలో ఒకడిగా గుర్తించి అక్కినేని గారు ఆ రోజు తన జన్మదిన వేడుకలలో నన్ను సత్కరించారు. అంతటి కోలాహలం లోనూ మా అమ్మాయి పెళ్ళికి ఇండియా నుంచి వచ్చిన మా కుటుంబ సభ్యులనీ, అప్పటికే వారం క్రితమే పెళ్లి అయిన మా అమ్మాయినీ, అల్లుడినీ, అతని కుటుంబాన్నీ సాదరంగా ఆశీర్వదించారు.  డాలస్ కార్యక్రమం అయ్యాక అక్కినేని గారు ఆయన చిరకాల మిత్రులూ, నాకు కూడా వ్యక్తిగతంగా అత్యంత ఆప్తులూ అయిన ముత్యాల భాస్కర రావు & సీత దంపతులని చూడడానికి  హ్యూస్టన్ వచ్చారు. ఆ రోజు అక్కినేని గారితో కొంత వ్యక్తిగత సమయం గడపడానికి నన్నూ, గాయని ఆకునూరి శారద,  మరి కొందరు ఆప్తులనీ ముత్యాల దంపతులు ఆహ్వానించారు. యధాప్రకారం అక్కినేని గారు ఆ ఇల్లంతా తన ఆప్యాయతతో, చలోక్తులతో నింపేశారు.



ఆ రోజు సాయంత్రం జరిగిన బహిరంగ కార్యక్రమంలో కూడా మాట్లాడే అవకాశం నాకు కలిగింది.  ఈ 2012 యాత్ర అక్కినేని వారి ఆఖరి అమెరికా యాత్ర.

ఇక గత సంవత్సరం అక్టోబర్ , 2013 లో నేను హైదరాబాద్ వెళ్ళినప్పుడు మా వంశీ రామరాజు గారి మెగా సన్మాన కార్యక్రమంతో సహా అక్కినేని గారి 90 వ పుట్టిన రోజు పండగలు అనేకం జరగడంలో ఏ మాత్రం ఆశ్చర్యం లేదు. వాటిల్లో వైభవంగా జరిగిన ఒక కార్యక్రమంలో నేను కూడా పాల్గొనడం నా అదృష్టమే. ఎందుకంటే అది నిర్వహించిన వారు అందరూ డాక్టర్లే. ఆ నాటి సభలో రెండు, మూడు విశేషాలు ఉన్నాయి. మొదటిదేమో ఆ నాటి సభలో దాసరి, సింగీతం, బ్రహ్మానందం, నటి లక్ష్మి మొదలైన సినీ ప్రముఖులూ, ప్రఖ్యాత వైద్య శిఖామణులూ వెరసి నలభై మంది పైగా అక్కినేని గారిని సత్కరించిన వారిలో ఉన్నారు కాబట్టి సభ రెండు విడతలు గా జరిగింది. నేను రెండో విడతలో వేదిక మీదకి ఆహ్వానించబడగానే అక్కినేని గారి పక్క కుర్చీలోనే గంట పైగా కూర్చునే అవకాశం నాకు దక్కింది. బ్రహ్మానందం తరువాత అక్కినేని గారి గురించి ఈ వ్యాసంలో పొందుపరిచిన కొన్ని సంగతులు ప్రస్తావిస్తూ నేను మాట్లాడాను.

ఇదంతా ఎలా ఉన్నా, చిన్న తమాషా ఏమిటంటే సభాప్రారంభానికి ముందు మొదటి వరసలో అక్కినేని గారు కూచున్నారు. సరిగ్గా ఆయన వెనకాల సీట్లలో నేనూ, “హాస్యకౌముది” లో అగ్ర తాంబూలం అందుకుంటున్న బలభద్రపాత్రుని రమణి అనే ఆత్మీయురాలూ కూచున్నాం. “మీకు అక్కినేని గారు పెర్సనల్ గా తెలుసా, నన్ను పరిచయం చెయ్యమంటారా? “ అని రమణి గారు నన్ను అడిగారు. వారిద్దరికీ చాలా పెద్ద స్నేహం ఉంది అని నాకు తెలుసు. అందు వలన “తెలుసు కానీ, పరిచయం చెయ్యి చూద్దాం, ఏమవుతుందో” అన్నాను. వెంటనే ఇద్దరం లేచి ఆయన దగ్గరకి వెళ్ళగానే “ఈయన ఫలానా ..అమెరికాలో ఉంటారు” లాంటి వాక్యాలతో రమణి అక్కినేని గారికి నన్ను పరిచయం చెయ్యబోతూ ఉండగా ఆయన ఒక నవ్వు నవ్వి “రమణీ, నువ్వు పుట్టక ముందు నుంచీ వంగూరి గారు నాకు తెలుసు” అన్నారు. అన్నేళ్ళ పరిచయంలో “సార్, నన్ను మీరు, వారు అనకండి. నువ్వు అని పిలవండి చాలు” అని ఏక వచనంలో సంబోధించమని ఎన్ని సార్లు ప్రాధేయపడ్డా ఆయన నన్ను ఎప్పుడూ “వంగూరి వారు, గారు ” అనే పిలిచే వారు. అది ఆయన మంచి సంస్కారాన్ని తెలియజేసినా, ఆయన చేత “నువ్వు” అనిపించుకునే అదృష్టం నాకు దక్క లేదు.

అక్కినేని నాగేశ్వర రావు గారి నిర్యాణ వార్త టీవీలో చూడగానే రెండు రోజుల పాటు నేను అన్ని పనులూ మానేసి అమెరికాలో వచ్చే టీవీ 9 మరియు టీవీ 5 న్యూస్ చానెల్స్ ని చూస్తూనే ఉన్నాను. ఆయన అసంఖ్యాక అభిమానులు, యావత్ సినీ పరిశ్రమ, ప్రభుత్వమూ చూపించిన ప్రేమాభిమానాలు ఒక మహా మనీషి సంపూర్ణ జీవిత పరిసమాప్తికి తగిన స్థాయిలోనే ఉన్నాయి అనిపించినా, ఆయన దహన క్రియలు కొంచెం లోటుగా ఉన్నాయి అని అనుకున్నాను. అక్కినేని గారు నాస్తిక వాది అని అందరికీ తెలిసినదే. అందు వలన వేద మంత్రాలతో అంత్య క్రియలు జరుపుతారు అని ఎలాగా అనుకోలేదు. కానీ అతి తక్కువ సమయాలలో తప్ప జీవితాంతం ఎప్పుడూ ఏ బహిరంగ సభలలో అయినా అక్కినేని గారు తెలుగుతనాన్ని చాటి చెప్తూ, పంచ కట్టూ, కండువా తోనే కనిపించే వారు. అలాంటిది ఆయన అంత్య క్రియలలో దహన సంస్కారం చేసిన వారందరూ జీన్స్, మామూలుగా ధరించే చొక్కాలు, పంట్లాలు వేసుకోవడం నాకు అదోలా అనిపించింది. కనీసం ఒక్కరైనా పంచె కట్టుతో కనపడి ఉంటే అక్కినేని గారి తెలుగు తనానికి నిదర్శనం గా ఉండేదేమో అని నాకు అనిపించింది.

ఏది ఏమైనా తెలుగు జాతికి, సంస్కృతికి, సినీ పరిశ్రమ కి పెద్ద దిక్కుగా దిశా నిర్దేశం చేసి తరతరాల కోట్లాది తెలుగు వారి "నట సమ్రాట్" గా వెలిగిన అక్కినేని నాగేశ్వర రావు గారికి తీపి జ్ఞాపకాలతో నా శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

మా బ్లాగ్: www.vangurifoundation.blogspot.com

COMMENTS